# పుస్తక సమీక్ష

## ఓడిన మనుషులకు ఊరట




**ఎంతోమంది** జీవితాలు కొద్ది సమయం వరకు, కొన్ని సంవత్సరాల వరకు బాగున్నా, అనుకోకుండా అందరి జీవితాల్లో కుదుపులు సంభవిస్తుంటాయి. దీంతో ఆకాశంలో తిరుగాడే వారు కూడా నేల మీదికి పడిపోతారు. ఇన్నాళ్లూ వాళ్లు గడిపిన జీవితం అంతా ఇప్పుడు శూన్యంగా అనిపిస్తుంది. అయితే, కొంతమంది ఆ కుదుపులకు తట్టుకుని నిలబడతారు. మళ్లీ జీవితంలో పరుగు మొదలుపెడతారు. కష్టపడి తాము అనుకున్న రంగంలో నిలదొక్కుకుంటారు. ఇంకొంతమంది మాత్రం ఆ అంధకారం నుంచి తేరుకోలేరు. వారికి జరిగిన సంఘటనల ప్రభావం నుంచి బయటపడలేరు. కాలం చేసిన గాయాన్ని మర్చిపోలేరు. దీంతో కుంగుబాటుకు లోనైపోయి అలాగే నాలుగు గోడల మధ్య బందీలుగా బతుకుతూనే ఉంటారు. అలాంటి వారికి మణి వడ్లమాని రాసిన 'పథికుడు' నవల ఓ మంచి సమాధానం. 'నా జీవితం ఇంతే! నాకు ఇక భవిష్యత్తు లేదు, ఏం చేసినా జీవితం మారదు, ఎన్ని ప్రయత్నాలు చేసినా కూడా ఈ జీవితం తాలూకు గాయాలు మానవు' అని కుమిలిపోయే వారికి ఈ నవల బాగా ఉపయోగపడుతుంది. అంతేకాదు, మనతో ఉన్న వాళ్లు నిజంగానే వంద శాతం నిజాయితీగా ఉన్నారా? వారి అంతరంగం అంతా మనతో చెప్పుకొంటున్నారా? మనం అసలు వారికి ఆ చెప్పుకొనే అవకాశం ఇస్తున్నామా? అనే ప్రశ్నలు నవల పూర్తి అయ్యాక రావడం ఖాయం. మనోవిశ్లేషణాత్మకంగా సాగే ఈ 'పథికుడు' నవల నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

... ఆరుద్ర ఈశ్వర్

**పథికుడు**

**రచన:** మణి వడ్లమాని
**పేజీలు:** 76; **ధర:** రూ. 150
**ప్రచురణ:** అచ్చంగా తెలుగు ప్రచురణలు
**ప్రతులకు ఫోన్:** 85588 99478, 96520 67891

## చక్రి భజనలు... భక్తి సోపానాలు




**చక్రిభజన** మహారాష్ట్రకు చెందిన భజన సంప్రదాయం. దీన్ని తెలంగాణలో ప్రాచుర్యంలోకి తెచ్చిన వ్యక్తి రుక్మాభట్ల విధుమౌళి శాస్త్రి. సంగీత, సాహిత్యాల్లో నిష్ణాతుడైన విధుమౌళి శాస్త్రి సిద్దిపేట జిల్లా గజవెల్లి వాస్తవ్యులు. మరుకూకు పాండురంగ ఆశ్రమంలో సిద్ధగురు నారాయణ గారి అనుగ్రహం పొందారు. ఆయన దగ్గరే శాస్త్రి వివిధ రకాలైన భజన స్వరూపాలను ఆకళింపు చేసుకున్నారు. మధ్య తెలంగాణ ప్రాంతంలో భజన సంప్రదాయ నెలకొల్పే దిశగా ఆయన తన గురువుగారితో కలిసి గజవెల్లిలో (గజ్వేల్) 'శ్రీరామ భజన సంఘం' స్థాపించారు. ఈ క్రమంలో విధుమౌళి శాస్త్రి 'శ్రీరామ భజన', 'శ్రీకృష్ణ భజన', 'శ్రీవిశ్వేశ్వర భజన' మొదలైన భజన గీతాలు అనేకంగా రచించారు. వీటిని విశాల చంద్రమౌళి శాస్త్రి పరిష్కరించారు. చక్రిభజనల ప్రచారానికి విధుమౌళి శాస్త్రి ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి 108 భజన సంఘాలను ఏర్పాటుచేశారు. ఆయన రచించిన వివిధ దేవతల భజనలు 'భజనావళి' పేరుతో శ్రీపాండురంగాశ్రమము వారు పుస్తకంగా తీసుకువచ్చారు. భగవత్ నామ స్మరణలో ఉత్తమమైనది దేవుడిని నోరారా కీర్తించడం. ఆ దిశగా విధుమౌళి శాస్త్రి భజనలు మనల్ని భగవంతుడి మార్గంలో నడిపిస్తాయి.

**భజనావళి**

**రచన:** రుక్మాభట్ల విధుమౌళి శాస్త్రి
**సంకలన కర్త:** మదునూరి వెంకటరామశర్మ
**పేజీలు:** 296; **ధర:** రూ. 150
**ప్రచురణ:** పాండురంగాశ్రమము
**ప్రతులకు:** 96764 54189

## ఘనం.. పీవీ వనం

### అమృతఫలం



**తీయని** పండ్లు ఎన్నో ఉన్నాయి. ఆ తీయని పండ్లలో సీతాఫలానికి సాటి రాగల ఫలం మరోటి లేదు. సీతాఫలం తీపిలో రారాజు. సీతాఫల చెట్టు తెలంగాణలో అన్నిచోట్లా కనిపిస్తుంది. అత్యల్ప వర్షపాతం ఉండే భూముల్లో సీతాఫల మొక్కలు సహజంగానే పెరుగుతాయి. ఇది చిన్న వృక్షం. వర్షాకాలంలో కాయడం మొదలవుతుంది. దసరా, దీపావళి వరకు కాస్తాయి. సంవత్సరంలో మూడు నెలలు మాత్రమే సీతాఫలాలు దొరుకుతాయి. సీతాఫలం లేత ఆకుపచ్చ రంగులో బొడిపెలతో గుండ్రంగా ఉంటుంది. తెల్లని గుజ్జులో అనేక విత్తనాలుంటాయి. అత్యంత తీయనైన సీతాఫలాన్ని గింజలు మింగకుండా తినడం ఓ కళ. పీవీ వనంలో సీతాఫలం, రామ సీతాఫలం, లక్ష్మణ సీతాఫలంతోపాటు సోర్ ఫ్రూట్ అని పిలిచే ఇంకోరకం ఔషధ సీతాఫల చెట్టు కూడా ఉంది. ఓ క్యాన్సర్ రోగి కోసం తెప్పించిన సోర్‌ఫ్రూట్ గింజల్లో ఒకటి ఇక్కడ మొలిచింది. అది ఈ మధ్యే కాస్తున్నది. తొక్క ముళ్లలా ఉంది. లోపలి గింజలు కూడా సీతాఫలం గింజల్లాగే ఉన్నాయి. వాసన కూడా అలాగే ఉంది. రుచి మాత్రం తీపిలో చింతపులుపు కలిసినట్టుగా ఉంటుంది. రామసీతాఫలం తొక్క బొడిపెలుగా ఉన్నా గరుకుగా ఉండకుండా, గళ్ల గీతలు ఉంటాయి. గింజలు తక్కువగా ఉండి, రుచి అతి మధురంగా ఉంటుంది. సీతాఫల చెట్లు దేశమంతటా ప్రకృతి సిద్ధంగా పెరుగుతాయి. శ్రీకాకుళం ప్రాంతం సీతాఫలాలకు ప్రసిద్ధి. మన దేశంలో సీతాఫలాన్ని వాణిజ్య పంటగా పెంచుతున్నారు. రైతులకు ఇది లాభదాయకమైన పంట. ఈ మధ్య సీతాఫలాలతో స్వీట్లు, జెల్లీలు, ఐస్‌క్రీమ్‌లు, జామ్‌లు మార్కెట్లోకి వస్తున్నాయి. హైదరాబాద్‌లోని మొజంజాహి మార్కెట్‌లో సీతాఫల్ ఐస్‌క్రీమ్ తినేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తారు. సీతాఫలం ఆకులు, బెరడు, వేళ్లు ఔషధ విలువలు కలిగినవే. సీతాఫల ఆకులు మధుమేహాన్ని తగ్గిస్తాయి. ఒంటినొప్పులు, ముఖ్యంగా అరికాళ్ల నొప్పులకు ఉపశమనం కలిగిస్తాయి. సీతాఫల ఆకులను అరికాళ్లకు కట్టుకొని నిద్రపోతే తెల్లారేసరికి ఉపశమనం కలుగుతుంది. సీతాఫలం తింటే జీర్ణవ్యవస్థ మెరుగవుతుంది. ఇందులో ఫాస్పరస్, కాల్షియం, ఇనుము వంటి ఖనిజ పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. మా చిన్నప్పుడు పోటీలు పడి ఈ పండ్లు సాయంత్రాలు తిని ఆటలకు పోయేవాళ్లం. సీతాఫలాలను సీజన్‌లో తినండి. ఎదిగే పిల్లలకు తినిపించండి.

▪ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు

(...13వ పేజీ తరువాయి)

**అది ఎవరు?**

### సమాధానం

సూరి చెప్పిన రెండు విషయాల ద్వారా అతని మోసాన్ని రుద్ర కనిపెట్టాడు. ఒకటి.. తన బ్లడ్ గ్రూప్ కాగా, రెండోది 2 వేల నోటు. తల్లిదండ్రుల బ్లడ్ గ్రూప్ ఓ, ఏ ఉన్నప్పుడు.. వారి బిడ్డలకు ఈ రెండిట్లో ఏదో ఒక బ్లడ్ గ్రూప్ వస్తుంది. అయితే, డాక్టర్ అడిగినప్పుడు తన బ్లడ్ గ్రూప్ 'బీ' అని సూరి చెప్పాడు. ఇక, యాక్సిడెంట్ 2015లో జరిగింది. ఆ యాక్సిడెంట్ కంటే ముందే తన తండ్రి తనకు 2 వేల నోటు ఇచ్చినట్టు సూరి చెప్పాడు. అసలు 2 వేల నోటు ప్రింట్ అయ్యిందే 2016 తర్వాత. అలా.. సూరి చెప్పిన ఈ రెండు విషయాలు వాస్తవదూరంగా ఉండటంతో అతనిమీద రుద్రకు అనుమానం కలిగింది. కాగా, ఈ కుట్ర చేస్తున్నప్పుడు తాను దొరికిపోయే ప్రతీ సందర్భంలో తనను తాను మోటివేట్ చేసుకోవడానికి తన అసలు తండ్రి రాసిచ్చిన 'నెవర్ గివప్' అనే కోట్‌ను చూసుకొని ధైర్యం తెచ్చుకోవడం సూరికి అలవాటు. ఇప్పుడు ఆ అలవాటే పొరపాటై రుద్రకు దొరికిపోయాడు.